
# అయ్యవార్లు మూడు రెట్లు పౌరులా?

## శాసనమండలిని రద్దుచేయాలి లేదా ప్రజాస్వామికంగా పునర్వ్యవస్థీకరించాలి

రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ (శాసనమండలి) ఎన్నికలు ఫిబ్రవరిలో జరగనున్నాయి. అదనపు ఓటుహక్కు లభించిన ప్రజాప్రతినిధులు, పట్టభద్రులు, అధ్యాపకులు హడావుడిగా నామినేషన్లు వేసుకుంటూ, ప్రచారం చేసుకుంటూ తిరుగుతున్నారు. తక్కిన ప్రజానీకానికి ఈ ఎన్నికల్లో ఓటుహక్కు లేదు కాబట్టి అది వాళ్ళకేమీ పట్టని విషయం అయింది.



ఇతర ప్రజానీకానికి ఈ ఎన్నికల్లో ఓటుహక్కు ఎందుకు లేదు?

అన్ని స్థాయిల్లో జరిగే ఎన్నికల్లోనూ దళితులకూ, ఆదివాసులకూ ఉండే రిజర్వేషన్లు శాసనమండలిలో ఎందుకు లేవు? 'ప్రతి మనిషికీ ఒకే ఓటు' అనేది పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని ప్రాథమికమైన సమానత్వ సూత్రం కాగా, ప్రజా ప్రతినిధులకూ, పట్టభద్రులకూ, శాసనసభనూ శాసనమండలినీ కలుపుకొని రెండు ఓట్లు, అయ్యవార్లకయితే మూడు ఓట్లు ఎందుకిస్తున్నారు? వాళ్ళు రెండు రెట్లు, వీళ్ళు మూడు రెట్లు పౌరులా?

నిత్యజీవితంలో జరిగే అన్యాయాలను ప్రజలందరూ గ్రహించగలుగుతారు. కానీ చట్టాలలో, విధాన ప్రవచనాలలో ఉన్న అన్యాయాలను చదువుకున్న వాళ్ళు, ప్రజా ప్రతినిధులు మాత్రమే సులభంగా గ్రహించగలుగుతారు. వారు చెప్తేనే ప్రజలు తెలుసుకుంటారు. మరి చదువుకున్న వాళ్ళకూ, ప్రజా ప్రతినిధులకూ ప్రత్యేక హక్కులు కల్పించే చట్టాల గురించి ఎవరు మాట్లాడాలి? వారి స్వప్రయోజనం కోసం వారు గంభీర మౌనం పాటిస్తారు. తక్కిన ప్రజానీకానికి ఎక్కడో ఏదో లోపం ఉందని తోచినా వివరాలు తెలియకపోవడం వల్ల తప్పనిసరై మౌనం పాటిస్తారు. ఆ అన్యాయం అన్యాయంగా ఉండిపోవలసిందేనా?

శాసన మండలిని ఇంగ్లీష్ వాడి పరిభాషలో 'ఎగువ సభ' అంటారు. అది చట్టాలు చేయదు, కానీ చట్టాలు చేసే శాసనసభను (దిగువ సభను) పర్యవేక్షిస్తుంది. శాసనసభ ఆమోదించిన చట్టాలను పరిశీలించి తన అభిప్రాయాలు, సూచనలు తెలుపుతుంది. ఈ అభిప్రాయాలకు ఏ విలువా లేదనుకుంటే శాసన మండలి అనేది ఉండడమే అనవసరం కాబట్టి, వాటికి ఏదో విలువ ఉందనే ఆ వ్యవస్థను రూపొందించారని భావించవలసి ఉంటుంది. మరి అటువంటి వ్యవస్థలో రిజర్వేషన్లు ఉండవు, ఓటు హక్కు కొద్దిమందికే ఉంటుంది అంటే అర్థం చట్టాలు చేసే అధికారాన్ని ప్రజాస్వామీకరించినా, దానిని పర్యవేక్షించే అధికారాన్ని ప్రధానంగా శిష్ట వర్గాలకు పరిమితం చేయాలన్న అప్రజాస్వామికమైన ఆలోచనను వ్యవస్థీకరించడమే కాదా? అన్ని విషయాలలోనూ గొంతుచించుకునే మేధావి వర్గమూ, రాజకీయ వర్గమూ తమకిద్దరికీ పెద్ద పీటవేసే ఈ వ్యవస్థ పట్ల మౌనం పాటించడమేకాక దానిలో స్థానంకోసం ఎవరికి వారు ఆరాటపడడం విచిత్రంగా లేదూ?

'ప్రతి మనిషికీ ఒకే ఓటు' అనేది పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని ప్రాథమికమైన సమానత్వ సూత్రం కాగా, ప్రజా ప్రతినిధులకూ, పట్టభద్రులకూ, శాసనసభనూ శాసనమండలినీ కలుపుకొని రెండు ఓట్లు, అయ్యవార్లకయితే మూడు ఓట్లు ఎందుకిస్తున్నారు? వాళ్ళు రెండు రెట్లు, వీళ్ళు మూడు రెట్లు పౌరులా?

శాసన మండలికి ఉండే ఈ అప్రజాస్వామిక స్వభావం రాజ్యాంగంలోనే రచించబడ్డ మాట వాస్తవమే. 'ప్రతి మనిషికీ ఒకే ఓటు ఇచ్చాం – ప్రతి మనిషికీ ఒకే విలువ ఉండే సమాజానికి ఇది సాధనం కావాలి' అని బాబాసాహెబ్ అంబేడ్కర్ భారత రాజ్యాంగం నైజాన్ని వివరిస్తూ చేసిన వ్యాఖ్యానానికి, శాసన మండలి రూపంలో కొందరికి రెండు ఓట్లు, కొందరికి మూడు ఓట్లు కల్పించిన ఆర్టికల్ 171 అభావం అనేది కూడా వాస్తవమే. అయితే శాసన మండలికి ఉండేది పర్యవేక్షక అధికారమే అయినప్పటికీ దీనిని రాజ్యాంగంలోని అప్రజాస్వామిక లక్షణాలలో ఒకటిగా గుర్తించడం సబబుగా ఉంటుంది తప్ప, రాజ్యాంగంలోనే ఉంది అంటూ వెనకేసుకు రావడం తగదు.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే రాజ్యాంగం తొలిముసాయిదాలో శాసన మండలి ప్రస్తావన మరీ ఇంత అప్రజాస్వామికంగా లేదు. బి.ఎన్.రావు తొలి రచన చేసి, అంబేడ్కర్ సారథ్యంలోని డ్రాఫ్టింగ్ కమిటీ తుదిరూపం ఇచ్చిన రాజ్యాంగం ముసాయిదాలోనూ

శాసనమండలి ప్రస్తావన ఉంది. అయితే అందులో అధ్యాపకులకూ, మేధావి వర్గానికీ పెద్దపీట వేయలేదు. శాసన మండలిలో కొన్ని సీట్లను ప్రజాప్రతినిధులు (పంచాయతీ స్థాయి నుంచి అసెంబ్లీ స్థాయి దాకా ఎన్నికైన వారు) ఎన్నుకుంటారని, కొన్నిటిని రాష్ట్ర గవర్నర్ తన నియామకం ద్వారా నింపుతారనీ అన్నారు. తక్కిన సీట్ల ఎన్నిక లేక ఎంపిక ఏ విధంగా జరుగుతుందో చెప్ప లేదు గానీ ఎవరిని ఎంపిక చేయాలో సూచించారు. వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, విద్యారంగం, కార్మికరంగం, సాంకేతిక కళాసాహిత్య రంగాలు మొదలైన సకల సామాజిక రంగాలతో సన్నిహిత పరిచయం ఉన్న నిపుణులను ఎన్నుకోవాలని అన్నారు. వివిధ సామాజిక రంగాలలో నైపుణ్యంగల వారు శాసన సభచేసే చట్టాలను పర్యవేక్షించి సలహాలూ, సూచనలూ ఇవ్వడం ఉచితంగా ఉంటుందన్నది దీని వెనుక ఉన్న ఆలోచన కావచ్చు. అయితే ఈ ముసాయిదాలో కూడా రిజర్వేషన్లు లేవు.

కానీ రాజ్యాంగానికి తుదిరూపం ఇచ్చే నాటికి ఇది మారిపోయింది. రాజ్యాంగ పరిషత్ సభ్యులలో ఒక్క జయప్రకాశ్ నారాయణ్ మాత్రమే శాసన మండలి ఉండనే వద్దన్నాడు. మిగిలిన వాళ్ళు దానికి మరింత అప్రజాస్వామిక రూపం ఇచ్చారు. ఎవరిని ఎన్నుకోవాలనేది తీసేసి ఎవరు ఎన్నుకుంటారనేది చేర్చారు. రాజ్యాంగం ముసాయిదాలోనే ప్రజాప్రతినిధులకు కల్పించిన ఓటుతో పాటు పట్టభద్రులకూ, అధ్యాపకులకూ ఓట్లు కల్పించారు. వారు ఎవరినైనా ఎన్నుకోవచ్చన్నారు. అదనంగా, ముసాయిదాలో రాసినట్టే, గవర్నర్ కొందరిని నియమించవచ్చునన్నారు. గవర్నర్ అంటే రాష్ట్ర ప్రభుత్వమే కాబట్టి ఇది రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన 'హక్కు'. ఈ నియామకాలు కళాసాహిత్య వైజ్ఞానిక రంగాలలోనూ, సహకార రంగంలోనూ, సామాజిక సేవలోనూ ప్రత్యేక ప్రవేశం లేక అనుభవం గల వారి నుంచి చేయాలని మాత్రం అన్నారు. ఏ పాలక పార్టీలోనైనా కళాపోషకులకూ, సంఘ సేవకులకూ కొదవలేదు కాబట్టి వారి 'హక్కు'కు ఈ షరతేం అడ్డం రాదు.

ఈ విషయంలో రాజ్యాంగం పేర్కొన్న ఒకే ఒక్క మంచి సంగతి ఏమిటంటే ఏ రాష్ట్ర శాసనసభైనా 2/3 మెజారిటీతో, తమకు శాసన మండలి అక్కరలేదని తీర్మానిస్తే, పార్లమెంటు తదనుగుణంగా చట్టంచేసి తీసేస్తుంది. అయితే మళ్ళీ ఆ రాష్ట్ర శాసనసభ తమకు కావాలని 2/3 మెజారిటీతో తీర్మానంచేస్తే అది తిరిగి వస్తుంది. మన రాష్ట్ర శాసన మండలిని ఈ ప్రకారంగా ఎన్‌టిరామారావు తీసేయిస్తే, రాజశేఖరరెడ్డి (ప్రతిపక్షాల సహకారంతో) తిరిగి తెచ్చాడు. అప్పట్లో ఎన్‌టిరామారావు ఆ పనిచేయడానికి శాసన మండలి కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉండడం కారణం కావచ్చును గానీ, అతను చేసిన కొద్ది మంచి నిర్ణయాలలో ఇదొకటి. అధికారదాహం శాసనసభతో తీరని పార్టీలన్నీ కలిసి దానిని తిరగదోడాయి.

## ప్రజాస్వామికమైన 'రెండవ సభ' సాధ్యంకాదా?

రెండవ సభ ఉండనే వద్దని మా అభిప్రాయం కాదు. నిజానికి ఒక చారిత్రక దశలో చట్టసభల ప్రాతినిధ్య స్వభావాన్ని గురించి చాలా చర్చ జరిగింది. ఎక్కువ భాగం చట్టసభల ఎన్నికలు ప్రాదేశిక నియోజకవర్గాల ప్రాతిపదికన జరుగుతాయి. అంటే 'ప్రజా ప్రతినిధులు' ఒక ప్రాంతానికి ప్రతినిధులుగా ఉంటారు, అయితే ఒక ప్రాంతంలో లేక భూభాగంలో నివసించే ప్రజలకు కొన్ని ఉమ్మడి సమస్యలు ఉన్నప్పటికీ సామాజిక, ఆర్థిక వర్గాల ప్రాతిపదికన భిన్న ప్రయోజనాలూ ఉంటాయి. కాబట్టి ప్రాదేశిక నియోజక వర్గాలతో బాటు, సామాజిక ఆర్థిక వర్గాలను నియోజకవర్గంగా గల రెండవ సభ ఉండడం ఉచితంగా ఉంటుందన్న చర్చ పందొమ్మిదవ

> **పట్టభద్రుల నియోజక వర్గాలు, అధ్యాపకుల నియోజక వర్గాలే కాక అంతకంటే పెద్ద సంఖ్యలో రైతు నియోజక వర్గాలు (అయ్యవార్ల జనాభా కంటే వ్యవసాయదార్ల జనాభా చాలా ఎక్కువ కాబట్టి), వ్యవసాయ కూలీల నియోజక వర్గాలు, పారిశ్రామిక కార్మికుల నియోజక వర్గాలు, వృత్తి పనులవారి నియోజక వర్గాలు వగైరా ఉండాలి. అందులో శాసనసభలో ఉన్నట్టే రిజర్వేషన్ ఉండాలి.**

శతాబ్దంలోనూ, ఇరవయ్యవ శతాబ్దపు ప్రథమార్థంలోనూ చాలా జరిగింది. ఇది పర్యవేక్షక అధికారం ఉండే 'ఎగువ సభ' కాదు. శాసనాధికారం ఉండే రెండవ సభ. ఈ ఆలోచనకు రూపం ఇచ్చేటట్టయితే కేవలం పట్టభద్రుల నియోజక వర్గాలు, అధ్యాపకుల నియోజక వర్గాలే కాక అంతకంటే పెద్ద సంఖ్యలో రైతు నియోజక వర్గాలు (అయ్యవార్ల జనాభా కంటే వ్యవసాయదార్ల జనాభా చాలా ఎక్కువ కాబట్టి), వ్యవసాయ కూలీల నియోజక వర్గాలు, పారిశ్రామిక కార్మికుల నియోజక వర్గాలు, వృత్తి పనులవారి నియోజక వర్గాలు వగైరా ఉండాలి. అందులో శాసనసభలో ఉన్నట్టే రిజర్వేషన్ ఉండాలి. సామాజిక వర్గీకరణ ప్రాతిపదికన దళిత కులాల నియోజక వర్గాలు, బిసి కులాల నియోజక వర్గాలు, స్త్రీల నియోజక వర్గాలు, మైనారిటీ మతాల నియోజక వర్గాలు, ఆదివాసీ నియోజక వర్గాలు వగైరా ఉండాలి. ఇటువంటి శాసన మండలిని రూపొందించి శాసన సభతో సమాన అధికారం కల్పించినట్టయితే అభ్యంతరం ఉండనక్కరలేదుగానీ ప్రజా ప్రతినిధులకూ, పట్టభద్రులకూ, అధ్యాపకులకూ ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించి, పాలక పార్టీకి నియామకం పేరిట కొన్ని సీట్లు నింపే అధికారం కల్పించి, అందులో కనీసం ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్ కూడా ఇవ్వని శాసనమండలి ఏ రకంగా ప్రజాస్వామికమైనది? చదువుకున్న వాళ్ళంతా దానిలో సభ్యత్వం కోసం ఉవ్విళ్ళూరుతుండడాన్ని ఏమనాలి?

**మానవహక్కుల వేదిక**



**Human Rights Forum (HRF)**